క్లుప్తంగా

మహిళపై దాడి

చౌడేపల్లి: మండలంలోని కావలివారిపల్లెలో శుక్రవారం పొలాలకు వెళ్లే దారికి అడ్డంగా గాడి తవ్వడంపై ప్రశ్నించిన మహిళపై దాడి చేసి గాయపరిచారు. బాధితురాలి కథనం మేరకు.. కాటిపేరి పంచాయతీ కావాలివారిపల్లెకు చెందిన గుర్రప్పకు ముగ్గురు కుమారులు చంద్ర, మోహన్, పాపన్న వున్నారు. వారు ఆస్తి పంపకాలు చేసుకున్నారు. ఈక్రమంలో మోహన్ పొలాలకు వెళ్లే దారిలో చంద్ర, పాపన్న అడ్డంగా గాడి తవ్వారు. దీనిపై మోహన్ భార్య లక్ష్మీదేవి ప్రశ్నించింది. దీంతో ఆగ్రహం చెందిన చంద్ర, పాపన్న ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆమెను భర్త మోహన్ పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పీపీఎస్ నూతన కార్యవర్గం



పీపీఎస్ నూతన కార్యవర్గం

పలమనేరు: పలమనేరు పరిరక్షణ సమితి నూతన కార్యవర్గాన్ని గురువారం సమితి కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీపీఎస్ అధ్యక్షుడిగా టీఎల్ నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా నారాయణ, వైస్ ప్రెసిడెంట్‌గా విజయకుమార్‌రెడ్డి, పొన్ముడి, కోశాధికారిగా రామచంద్ర, సంయుక్త కార్యదర్శులుగా వెంకటాచలపతి, రెడ్డెప్పనాయుడు, దేవరాజులు, దొరస్వామి, విజయకుమార్, సాంబయ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఇందుకు గౌరవ ప్రెసిడెంట్‌గా ఆనందబాబు, క్రమశిక్షణ సంఘం కమిటీగా సుబ్రమణ్యం పిళ్లై, సీతారామయ్యను ఎంపిక చేశారు. పట్టణంలోని సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కొత్త కమిటీ పనిచేస్తుందని నూతన ప్రెసిడెంట్ టీఎల్ నరసింహులు పేర్కొన్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలు



అగరంలో ఊరేగేస్తున్న స్వామి వారు

గుడుపల్లె: మండలంలోని అగరం, సోడిగానిపల్లె, పాగురుపల్లె, కనమనపల్లె గ్రామాల్లో గురువారం దసరా ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. 9 రోజులు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గురువారం విజయ దశమి సందర్భంగా అగరంలో వున్న శ్రీదేవి, భూదేవి సమేత తిమ్మరాయస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. జమ్మి చెట్టుకు పూజలు చేశారు. అదే విధంగా కనమనపల్లెలో శ్రీనివాస స్వామి ఆలయంలో అమ్మవార్లను ఊరేగించారు.

వైభవంగా చౌడేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ట



చౌడేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్టలో వైఎస్సార్‌సీపీ నేతలు

బైరెడ్డిపల్లె: మండలంలోని రామాపురంలో శుక్రవారం చౌడేశ్వరి దేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రామ్‌రాజ్ ఆలయాన్ని నిర్మించారు. గ్రామస్తులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. అలాగే వాసవీ కన్యకా పరమేశ్వరి, బాటగంగమ్మ, సల్లాపురెమ్మ, తీర్థంలో వెలసిన రామచంద్రస్వామి ఆలయాల్లో గురువారం దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

పలమనేరు: పట్టణంలోని గంగమ్మగుడి కాంప్లెక్స్‌లో క్రిష్ణమ్మగారి జీవధార ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పట్టణానికి చెందిన పలువురు ప్రైవేటు, ప్రభుత్వ వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. డీఎస్పీ డేగల ప్రభాకర్, నిర్వాహకులు జనార్దన్ పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ



మధుసూదన్‌తో మాట్లాడుతున్న కార్మికులు

చౌడేపల్లె: డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ, ఐఏఎస్ అధికారి మధుసూదన్ గురువారం కుటుంబ సమేతంగా బోయకొండ గంగమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఈవో ఏకాంబరం స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయనను పలువురు కాంట్రాక్ట్ కార్మికులు కలిశారు. తమను రెగ్యులర్ చేయాలని, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న 73 మందిని కాంట్రాక్టు సిబ్బందిగా పరిగణించేలా చూడాలని కోరారు.

పలమనేరులో జోరుగా ఆక్రమణలు



మదనపల్లి రోడ్డులో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన రేకుల షెడ్డు



మదనపల్లి రోడ్డులో బసవన్నగుడి వెనుక అక్రమంగా నిర్మించిన షెడ్డు

- పట్టపగలే వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు
- వెలుగులోకి ఫోర్జరీ పట్టాలు
- నోరు మెదపని అధికారులు

అధికారం మనది. ఇప్పుడు కాకుంటే ఇంకెప్పుడు ఆక్రమించుకుంటావు. అధికారులు మాట్లాడకుండా మేము చూసుకుంటాం. ఎలాంటి ఇబ్బందులు లేవు. నీవు నిర్మాణాలు చేస్కో. ఎవరైనా అడిగితే మా పేరు చెప్పు. ఇది పలమనేరు మున్సిపాలిటీలో జరుగుతున్న వ్యవహారం. మున్సిపాలిటీకి చెందిన స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. వీటి వెనుక వున్న కీలక సూత్రధారి ఎవరనే విషయంపై పట్టణంలో జోరుగా చర్చసాగుతోంది.

పలమనేరు: పట్టణంలోని మదనపల్లి రోడ్డు, గుడియాత్తం రోడ్డులో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఇక్కడ చదరపు అడుగు విలువ రూ.4 వేలుగా ఉంది. దీంతో అక్రమార్కుల కన్ను ప్రభుత్వ, మున్సిపల్ స్థలాలపై పడింది. ఈ నేపథ్యంలో అంబేడ్కర్ విగ్రహానికి కూతవేటు దూరంలో గతంలో మాజీ మంత్రిగా ఉన్న అమరనాథ్ రెడ్డి బీసీ భవన్ కోసం శంకుస్థాపక చేశారు. ఆ స్థలం ఇప్పటికే కబ్జాకు గురైంది. దాని విలువ ఇప్పుడు రూ.50 లక్షలకు పైమాటే. అలాగే మదనపల్లి రోడ్డులో సత్య బిల్డింగ్‌కు ఎదురుగా బసవన్న గుడి వెనుక వైపున్న మురుగు కాలువపై ఒక వ్యక్తి ఇటీవల రేకుల షెడ్డు నిర్మించాడు. గుడియాత్తం రోడ్డులోని ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఎదురుగా మరో వ్యక్తి మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించుకున్నాడు. దండపల్లి రోడ్డులో అధికార పార్టీకి చెందిన వ్యక్తి దర్జాగా ప్రభుత్వ స్థలంలో రేకుల షెడ్డు కట్టేశాడు. తాజాగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా మరో వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్నాడు. దీనికి అన్ని పత్రాలున్నాయంటూ పక్కా నిర్మాణాలు చేస్తున్నాడు. ఈ అక్రమాల వెనుక అధికార పార్టీకి చెందిన కీలక వ్యక్తి వున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆయన జోలికెళ్లేందుకు మున్సిపల్ అధికారులు సైతం జడుసుకోవాల్సిందేననే మాట వినిపిస్తోంది.

రకరకాలుగా మోసాలు

ప్రభుత్వ స్థలాలను సైతం ప్రైవేటు వారి ద్వారా లీజుకు రాసుకుని మున్సిపల్ అధికారుల ద్వారా వాటికి అనుమతులు పొందుతున్నారు. మరికొందరు కొన్నాళ్లుగా తమ స్వాధీనం వుందని పేర్కొంటూ ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజు చెల్లిస్తూ కోర్టులకు వెళ్లి స్థలాలను వాడుకుంటున్నారు. మరికొందరు ఇది తమ స్థలమేనంటూ వేరొక ప్రాంతంలోని డాక్యుమెంట్లు చూపుతున్నారు. ఇవన్నీ అధికార పార్టీ నేతలు, మున్సిపల్ అధికారుల ప్రమేయంతోనే సాఫీగా సాగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమాలపై మున్సిపల్ టీపీఎస్ ఇందిరను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె ఫోన్ తీయలేదు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని వివరణ కోరగా ఆక్రమణ విషయాలు తన దృష్టికి రాలేదని తెలిపారు. ఇప్పుడు తెలిసింది కాబట్టి వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ధర్నాలకు దిగుతాం...



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపల్ స్థలాల ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. పత్రికలో కథనాలు వచ్చినా మున్సిపల్ అధికారులు అసలు పట్టించుకోవడంలేదు. అందుకే తమ పార్టీ ద్వారా ఆక్రమణలు జరిగిన చోట అధికారులు వచ్చేదాకా ధర్నాలకు దిగుతాం.

చెంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పలమనేరు

ముత్యాలమ్మకు వెండి కిరీటం, పంచ పాత్రల వితరణ



రొంపిచెర్ల: రొంపిచెర్లలో వెలసిన ముత్యాలమ్మ గురువారం రాజ రాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దసరా సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉభయదారులుగా ముత్యాలు, దామోదర్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అమ్మవారికి శుక్రవారం బోడిపాటివారిపల్లె పంచాయతీ దద్దాలవారిపల్లెకు చెందిన డాక్టర్ నారాయణ స్వామి నాయుడు కుటుంబ సభ్యులు రూ.1,16,400 విలువైన వెండి కిరీటం, పంచ పాత్రలు వితరణ చేశారు. అలాగే తిరుపతికి చెందిన దామోదర్ కుటుంబ సభ్యులు రూ.1.15 లక్షల విలువైన అమ్మవారి రాతి పాదాలు, బలిపీఠం, సింహం విగ్రహాలను అందజేశారు. వాటికి శాంతి పూజలు, అభిషేకం, అర్చనలు చేసి ప్రతిష్టించారు. దాతలను ఆలయ మర్యాదలతో సన్మానించినట్లు అర్చకులు తెలిపారు.

ఇంటి దొంగలపై వేటు

పలమనేరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో విలువైన సామగ్రిని తస్కరించి సొమ్ము చేసుకున్న నలుగురు సిబ్బందిని విధుల నుంచి తొలగించినట్టి సూపరింటెండెంట్ డాక్టర్ మమతారాణి తెలిపారు. ఆస్పత్రిలోని విలువైన వస్తువులను చోరీ చేసి గుజిరీ దుకాణంలో రహస్యంగా విక్రయించిన విషయం వెలుగుచూసింది. ఈ విషయం మీడియాకు తెలియకముందే నలుగురి సిబ్బందిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ వేటువేశారు. నిందితులపై పోలీసులకు ఫిర్యాదు చేశారా లేదా అనే విషయం తెలియాల్సి ఉంది.

ఘనంగా కోనేటిరాయుడి పార్వేట ఉత్సవం



పార్వేట మండపానికి బయలుదేరిన శ్రీవారు

గంగవరం: మండలంలోని కీలపట్లలో వున్న టీటీడీ అనుబంధ కోనేటిరాయస్వామి ఆలయంలో గురువారం దసరా సందర్భంగా పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించి పంచాయుధాలతో గ్రామానికి కిలోమీటర్ దూరంలోని అటవీ ప్రాంతంలో ఉన్న పార్వేట మండపం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ విశేష పూజలు చేశారు. అనంతరం బల్లెంతో వేటను కొనసాగించారు. అర్చకులు దేవరాజాచార్యులు మాట్లాడుతూ పూర్వం క్రూరమృగాలు, జంతువులు పంటలను నాశనం చేసేవని, స్వామివారు వాటిని వేటాడి ప్రజలకు భయం పోగొట్టారని, అందువల్లనే ఏటా ఈ పార్వేట ఉత్సవం నిర్వహిస్తామని తెలిపారు. పార్వేట ఉత్సవం అనంతరం స్వామివారు తిరిగి ఆలయానికి చేరుకున్నారు. ఆయనకు కనుల పండువగా గ్రామోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, అర్చకులు శ్రీహర్ష దీక్షితులు, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్ రెడ్డిని విమర్శించే హక్కు చల్లాకు లేదు



మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

రొంపిచెర్ల: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని విమర్శించే హక్కు పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి లేదని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి తెలిపారు. వారు శుక్రవారం చిచ్చిలివారిపల్లెలో విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, చంద్రబాబునాయుడుకు సుదీర్ఘకాలంగా రాజకీయ విభేదాలు వున్నాయని తెలిపారు. జిల్లాలో తన ఆధిపత్యానికి అడ్డుగా వున్నారన్న ఉద్దేశంతోనే పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేయాలనే మిథున్‌రెడ్డిని మద్యం కేసులో ఇరికించారని దుయ్యబట్టారు. ఆయనపై చల్లా రామచంద్రారెడ్డి విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తాడని తెలిపారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం సొంత డబ్బు ఖర్చు చేసి రాజకీయాలు చేస్తుందని, ఎవరినీ బెదిరించి డబ్బులు తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. పెద్దిరెడ్డి ఎలాంటి వారో చిత్తూరు జిల్లాలో అందరికీ తెలుసన్నారు. సమావేశంలో విజయశేఖర్, బాలాజీ, శ్రీనాథనాయుడు, అమరనాథ రెడ్డి, యుగంధర్ రెడ్డి, హరికృష్ణారెడ్డి, సి.వి.రమణ, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుభ కార్యక్రమాల్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి





పుంగనూరు: అమరేంద్ర గృహప్రవేశంలో పాల్గొన్న పెద్దిరెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో కలిసి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆవుల అమరేంద్ర గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలోని మార్లపల్లెలో శ్రీనివాసులు గృహప్రవేశంలో పాల్గొని కుటుంబ సభ్యులను అభినందించారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ చైర్మన్ అమ్ము, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, జిల్లా యూత్‌వింగ్ కన్వీనర్ కొత్తపల్లె చెంగారెడ్డి, రాజేష్, బండ కుమార్, పట్టణ అధ్యక్షుడు ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

సదుమమ్మ సేవలో ఎమ్మెల్యే దంపతులు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె సదుమమ్మ ఆలయంలో గురువారం విజయదశమి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఈ పూజల్లో వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్వర్ణలతమ్మ దంపతులు పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించారు.

గృహ ప్రవేశంలో పాల్గొన్న మాజీ మంత్రి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పులిచెర్ల పంచాయతీ వగళ్లవారిపల్లెలో సతీష్‌రెడ్డి శుక్రవారం నూతన గృహ ప్రవేశం చేశారు. ఇందులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. గ్రామదేవత సత్యమ్మకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, జిల్లా ప్రింటింగ్ ప్రెస్ మాజీ చైర్మన్ గోటూరి మురళీమోహన్‌రెడ్డి, గోవిందరెడ్డి, నిరంజన్‌రెడ్డి, కేశవరెడ్డి, ఎస్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని గడ్డంవారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్రమణ్యం కుమారుడు హరీష్, రేఖా చాందిని వివాహం గురువారం రాత్రి తిరుపతిలోని శ్రీనివాస కల్యాణ మండపంలో జరిగింది. ఇందులో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డీశ్వరరెడ్డి, ముర్వత్ బాషా, హేమసుందరరెడ్డి, విజయభాస్కరరెడ్డి, కలాం, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



గర్భిణులకు గుడ్లు అందజేస్తున్న సూపర్‌వైజర్ శిరీష

రొంపిచెర్ల: మండలంలోని బండకిందపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష మాట్లాడుతూ గర్భిణులు క్రమంతప్పకుండా ప్రతినెలా వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేసుకోవాలన్నారు. అనంతరం గుడ్లు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తహసీర, సుస్మిత, జహీరా తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మల్లీశ్వరి

సదుం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి తెలిపారు. మండలంలోని కలకటవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పోషకాహార స్టాల్స్‌ను పరిశీలించారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు నివాళి

సదుం: మండలంలోని ఊటుపల్లెకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సురేంద్ర రెడ్డి (83) మృతిచెందారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకున్నారను. సురేంద్రరెడ్డి భౌతికదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, సర్పంచులు శ్రీనివాసులురెడ్డి, రెడ్డెమ్మ, ఎంపీటీసీ స్వరూప, నాయకులు ప్రభాకర రెడ్డి, రామచంద్రయ్య, మురళీనాయుడు, రవికుమార్ నాయుడు, హేమసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతునికి నివాళి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని రెడ్డివారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వంకిరెడ్డి సహదేవరెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రెడ్డివారిపల్లెకు చేరుకున్నారు. సహదేవరెడ్డి భౌతికదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్ర నాథరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, కేశవరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

గాంధీ స్ఫూర్తితో ముందుకెళ్లాలి



మున్సిపల్ : మొక్కలు నాటుతున్న అధికారులు



కుప్పం: గంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

పలమనేరు: గాంధీజీ స్ఫూర్తితో ముందుకెళ్లాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. పలమనేరు మున్సిపాలిటీ కార్యాలయంతోపాటు పలుచోట్ల గాంధీ జయంతి, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కమిషనర్ రమణారెడ్డి, సిబ్బంది, కూటమినేతలతో కలిసి బాపూజీ ఉద్యానవనంలోని బాపూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా అక్కడ పారిశుద్ధ్య పనులు చేపట్టారు. బాపూజీ పార్కులో మొక్కలను నాటారు. అలాగే పట్టణంలోని ఏపీ పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో గాంధీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గాంధీజీకి ఘన నివాళి

కుప్పం: పట్టణంలోని కడా కార్యాలయం ప్రాగణంలో గురువారం పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని జరుపుకున్నారు. గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జీఎస్టీ తగ్గింపు రైతులకు ఎంతో మేలు



పలమనేరులో ర్యాలీ చేస్తున్న అధికారులు

పెద్దపంజాణి: జీఎస్టీ తగ్గించడం వల్ల వ్యవసాయ పరికరాల ధరలు తగ్గాయని ఏవో హేమలత, ఎంపీడీవో బాలాజి తెలిపారు. వారు శుక్రవారం జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించేందుకు జాతీయ రహదారిపై ట్రాక్టర్లతో ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ ట్రాక్టర్లు, డ్రిప్ ఇరిగేషన్, వ్యవసాయ పనిముట్లు, పాల క్యాన్లు, బయోపెస్టిసైడ్స్ తదితరాలపై 12 శాతం వున్న జీఎస్టీ 5 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమారాణి, ఏపీవో మురుగేషన్, పశు వైద్యాధికారిణి వినిత, ఏపీఎం నీరజ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ర్యాలీ

పలమనేరు: జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు కలుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. వారు శుక్రవారం జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే లాభాలను వివరిస్తూ పట్టణంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ట్రాక్టర్ల ర్యాలీ

బైరెడ్డిపల్లె: జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఏవో గీతాకుమారి, ఎంపీడీవో ఆనందబాబు తెలిపారు. వారు శుక్రవారం జీఎస్టీ తగ్గింపుపై రైతులకు ట్రాక్టర్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చెక్‌పోస్టు కూడలి వద్ద మానవ హారం ఏర్పాటుచేశారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని కాల్చడంపై నిరసన



పలమనేరులో ప్రజాసంఘాల ప్రతినిధుల నిరసన



మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నేతలు

గంగవరం: జిల్లాలోని వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని దుండగులు కాల్చడం దారుణమని వైఎస్సార్ సీపీ దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు శుక్రవారం నిరసన తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద మాట్లాడుతూ దేవళంపేట ప్రధాన కూడలిలో అంబేడ్కర్ విగ్రహం ఉండడాన్ని సహించలేకే కూటమి నాయకులు కాల్చారని దుయ్యబట్టారు. దుండగులపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం ఏమిటని నిలదీశారు. కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు పెరిగాయన్నారు. విగ్రహం కాల్చిన ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళితులంతా ఏకతాటిపైకి వచ్చి నిరసనలు ఉధృతం చేస్తామన్నారు. పార్టీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, చంద్రప్ప, యూత్ అధ్యక్షుడు కిషోర్‌నాయుడు, మహేష్, బద్రి, విజయ్, రెడ్డిప్రసాద్, యర్రబల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

పలమనేరు: వెదురుకుప్పం మండలం దేవళంపేట వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని తగులబట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలు ప్రజాసంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, బీఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఈశ్వర్, ఓబుల్‌రాజు, శివాడి గోవిందు పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం దారుణమని ఎస్సీ ఉద్యోగుల సంఘం నాయకులు పుష్పరాజ్, నాగయ్య, జయరామ్, రవి ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిందితులను అరెస్టు చేయాలి

పుంగనూరు: వెదురుకుప్పంలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని అరెస్ట్ చేయాలని ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఆర్.అశోక్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టడం దారుణమన్నారు. నిందితులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నాగరాజ, రమణ, శ్రీనివాసులు, భాస్కర్, కమలేష్, గంగా, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.